క్లుప్తంగా

నేడు నాటక ప్రదర్శన

మదనపల్లె: బుద్ధుడితో నా ప్రయాణం–డాక్టర్ అంబేడ్కర్ నాటికను శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు స్థానిక మిషన్‌కాంపౌండ్‌లో ప్రదర్శిస్తామని బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ తెలిపారు. గురువారం జరిగిన మీడియా సమావేశంలో నాటిక ప్రదర్శన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యుదయ ఆర్ట్స్ సౌజన్యంతో అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ నృత్య, గేయ నాటికలో బుద్ధుని తాత్వికత, అంబేడ్కర్ బౌద్ధ ధర్మ పునరుజ్జీవ ఉద్యమ నేపథ్యాన్ని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. మదనపల్లె, పరిసర ప్రాంత సాహితీవేత్తలు, కవులు, రచయితలు, విద్యార్థులు, అంబేడ్కర్ వాదులు నాటిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. ప్రదర్శనకు హాజరయ్యే వారికి భోజనం వసతి ఏర్పాటు చేశామని తెలిపారు. బాస్ రాష్ట్ర కోశాధికారి ఎస్.రమణ, కార్యదర్శి టీఏ.పీర్, బయ్యన్న, రవిశంకర్, రెడ్డెప్ప, రమణ, తలారి కృష్ణ, గంగాధర్, శ్రీనివాసులు, రెడ్డిప్రసాద్, నరసింహులు పాల్గొన్నారు.

గంగమ్మకు అభిషేకం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణ పరిధిలోని జగనన్న కాలనీలో నూతనంగా వెలసిన శ్రీలాభాల గంగమ్మ ఆలయంలో గురువారం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈ నెల 19, 20 తేదీలలో అమ్మవారికి దీలు, బోనాలు సమర్పిస్తామని ఆలయ ధర్మకర్త రామాంజులు తెలిపారు. కాలనీ వాసులు ఆనందశెట్టి, సురేంద్రరెడ్డి, శైలజ, సూరి, కుమార్, గణేష్, శ్రీనివాసులురెడ్డి, శీన, నరేష్, రెడ్డిరామాంజులు, గోకుల్ తదితరులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

వైభవంగా పీర్ల ఊరేగింపు



పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట పంచాయతీలోని సామాడుపల్లి, గజ్జెలవారిపల్లి, బొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం పీర్లను వైభవంగా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మెక్కుబడులు చెల్లించారు. శుక్రవారం బండమీదపల్లి, బురదవాండ్లపల్లి గ్రామాల్లో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

కారంచేడు మృతవీరులకు నివాళి



ర్యాలీ చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పీలేరురూరల్ : కారంచేడు మృతవీరులకు దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ 1985 జూలై 17న కారంచేడులో భూస్వాములు దళితవాడను నెత్తుటి కుప్పగా మలచిన మారణకాండకు 40 ఏళ్లు గడిచాయన్నారు. ఈ దారుణకాండకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక శక్తులు నిరసనలు తెలిపి గొప్ప చైతన్యాన్ని నింపాయన్నారు. దీంతో జాతీయ స్థాయి ఉద్యమానికి నాంది పలికి ఎస్సీ, ఎస్టీ, అత్యాచార నిర్మూలన చట్టం వచ్చిందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో దళిత సంఘాల తమ హక్కుల సాధనకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు తుమ్మల ధరణికుమార్, పాలకుంట శ్రీనివాసులు, గండికోట వెంకటేష్, మహేష్‌యాదవ్, ముల్లంగి కృష్ణయ్య, వెంకటరమణ, చంద్రయ్య, విజయభాస్కర్, మురళీ, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పూజ చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత పొందవచ్చని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్మాతికను అలవర్చుకొని ప్రశాంత జీవనం గడుపాలని సూచించారు. ఆయన వెంట నాయకులు భాస్కర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రామమూర్తి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

పెళ్లిళ్లు లేక వ్యాపారాలు డీలా

- ఆషాఢం సెంటిమెంట్‌తో తగ్గిన పట్టుచీరల కొనుగోళ్లు
- భారీ డిస్కౌంట్‌లు ఇస్తున్న షోరూం నిర్వాహకులు
- ఆశించిన స్థాయిలో సాగని విక్రయాలు



వ్యాపారాలు లేక బోసిపోయిన దుకాణాలు

మదనపల్లె సిటీ: పట్టుచీరలకు పేరుగాంచిన మదనపల్లె (నీరుగట్టువారిపల్లె) నిత్యం వివిధ ప్రాంతాల వ్యాపారులు, కొనుగోలుదారులతో కళకళలాడేది. రోజూ కోట్ల రూపాయల వ్యాపారం జరిగేది. కానీ ఆషాఢం దెబ్బకు పట్టు చీరల వ్యాపారం కళ తప్పింది. కొనుగోళ్లు లేక చీరలు సిల్క్‌షాపుల్లో ఉండిపోగా, అటు వ్యాపారులు, ఇటు నేతన్నలు దిక్కు తోచని స్థితిలో పడ్డారు.

ఉపాధి కరువు

పట్టుచీరల ఎగుమతుల్లో నీరుగట్టువారిపల్లెది ప్రత్యేక స్థానం. అందుకే నిత్యం ఇతర రాష్ట్రాల వ్యాపారుల రాకపోకలు, పట్టుచీరల అమ్మకాలతో సందడిగా ఉండే పట్టుచీరల మార్కెట్ నేడు కొనుగోలు దారులు రాకపోవడంతో వెలవెలబోతోంది. ఆషాడమాసం కారణంగా శుభకార్యాలు లేకపోవడం పట్టుచీరల అమ్మకాలు మందగించాయి. పైగా షోరూం నిర్వాహకులు భారీగా డిస్కౌంట్ అడుగుతుండటంతో పట్టుచీరల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో సుమారు 500కు పైగా పట్టుచీరల దుకాణాలు (సిల్క్‌హౌస్‌లు) ఉండగా మూడు నెలలుగా ఎక్కడ చెప్పుకోదగ్గ వ్యాపారం జరగడం లేదు. ఇతర రాష్ట్రాల వ్యాపారులూ ఆన్‌సీజన్‌లో నీరుగట్టువారిపల్లెకు రాకపోవడంతో అనుబంధ రంగాల్లోని వారికీ ఉపాధి కరువైంది.

పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు

నీరుగట్టువారిపల్లె సిల్క్‌హౌస్‌ల యజమానులు కావాల్సిన డిజైన్లలో చీరలు నేయించుకుంటారు. అంతేకాకుండా సొంతంగా మగ్గాలపై చీరలు నేయించి అమ్మకాలు నిర్వహిస్తున్నారు. చేనేతమగ్గంపై తయారైన పట్టుచీరలలు రూ.5 వేల నుంచి రూ.లక్ష, రూ.2 లక్షల వరకు ధరలు ఉంటాయి. ఈ చీరలను పొరుగు రాష్ట్రాలైన చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, కంచి, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి నగరాల్లోని పట్టు చీరల షోరూంలకు హోల్‌సేల్‌గా అమ్ముతారు. అలాగే తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల వ్యాపారులూ నీరుగట్టువారిపల్లెకు వచ్చి పట్టుచీరలు కొనుగోలు చేస్తారు.

ముహూర్తాల సీజన్‌పైనే ఆశ

ప్రస్తుతం ఆషాఢమాసంలో నష్టాలను పూడ్చాలంటే రానున్న శ్రావణం, మాఘమాసం, వినాయకచవితి, దసరా, దీపావళి పండుగలలో జరిగే వ్యాపారంపై వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. ఈ సీజన్‌లో పట్టు చీరల విక్రయాలు జోరందుకుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు ఈ ఏడాది పంటలు బాగా పండితేనే పట్టుచీరల వ్యాపారం గాడిలో పడే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే వర్షాభావ పరిస్థితులు కనసిపిస్తుండటంతో వ్యాపార వర్గాల్లో తీవ్ర ఆందోళన మొదలైంది.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



అన్‌సీజన్‌వల్ల పట్టుచీరల అమ్మకాలు తగ్గాయి. దీంతో మేం నష్టపోతున్నాం. ప్రభుత్వం సొసైటీల ద్వారా అన్‌సీజన్‌లోనూ పట్టు ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చర్యలు చేపడితే ప్రయోజనం ఉంటుంది. వ్యాపారులకు పరిశ్రమల శాఖ నుంచి రాయితీ రుణాలు అందివ్వాలి. అప్పుడు పరిశ్రమ గాడిలో పడుతుంది.

–దండు రామాంజులు, పట్టుచీరల వ్యాపారి, నీరుగట్టువారిపల్లె

చీరల ఉత్పత్తి తగ్గింది



వ్యాపారం చాలా ఇబ్బందిగా ఉంది. చేనేత సంక్షోభం కారణంగా పట్టుచీరల ఉత్పత్తి తగ్గింది. ఆన్‌సీజన్‌తో పెట్టుబడి స్తంభించిపోయింది. ప్రభుత్వం స్పందించి పట్టుచీరలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపాలి. పట్టు చీరల వ్యాపారులకు రాయితీలు ఇవ్వాలి.

–సుధాకర్, చేనేత కార్మికుడు, నీరుగట్టువారిపల్లె

దైవ చింతన అలవర్చుకోవాలి



పుట్టపర్తి సాయిబాబా రథయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, నాయకులు

కలికిరి(వాల్మీకిపురం): ప్రతీ ఒక్కరూ దైవ చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఈ ఏడాది నవంబరు నెల 23న పుట్టపర్తి సాయిబాబా 100వ జయంతిని పురస్కరించుకుని పుట్టపర్తి సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా రథయాత్రలు తలపెట్టారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం రథయాత్ర మదనపల్లి నుంచి వాల్మీకిపురానికి చేరుకోవడంతో పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంఘీభావం తెలిపి, రథయాత్రకు స్వాగతం పలికారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతల శివానందరెడ్డి, చింతల ఆనందరెడ్డి, నీళ్ల భాస్కర్, జే.క్రిష్ణమూర్తి, బిడ్డల కేశవరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన చింతల

మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన స్వగృహంలో గురువారం పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీబలోపేతం,పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేయాలని మాజీ మంత్రి సూచించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి, పార్టీ పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బిడ్డల కేశవరెడ్డి మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

డిపో అభివృద్ధికి శ్రీకారం

మదనపల్లె సిటీ: ఆర్టీసీ డిపో పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ టి.అమరనాథ్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రూ.12 లక్షలతో బస్‌స్టేషన్‌లో 10 ప్లాట్‌ఫారమ్‌ల నిర్మాణపనులు చురుగ్గా సాగుతున్నట్లు చెప్పారు. దీంతో పాటు అదనంగా మరో 12 ప్లాట్‌ఫారమ్‌లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. డిపోలోని కార్గో గది చిన్నదిగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురువుతున్నాయన్నారు. దీని కోసం ప్రత్యేక గది నిర్మాణం, డిపోలో మోడ్రల్ టాయిలెట్స్, షాప్‌రూముల ఆధునీకరణ, గ్యారేజీలో మోడ్రన్ టాయిలెట్స్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆదరించాలని కోరారు. సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పీలేరురూరల్: అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో పనిచేసిన ఒప్పంద అధ్యాపకులు ఈ విద్యాసంవత్సరానికి తమ సర్వీస్ రెన్యువల్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ ద్వారా ఈ నెల 21 లోపు ఐడీ కళాశాల, స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమర్పించాలని కోరారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



మాట్లాడుతున్న ఇండియన్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్

తంబళ్లపల్లె: సైబర్ నేరగాళ్ల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. గురువారం ఇండియన్ బ్యాంకులో ఖాతాదారులకు సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించారు. బ్యాంకుల నుంచి ఎలాంటి మెసేజ్‌లు పంపమని ఎవరైనా మెసెజ్‌లు పంపితే బ్యాంకు ఖాతా నంబర్, ఓటీపీ చెప్పకూడదన్నారు. ప్రభుత్వ పథకాలతో ఏపికే వంటి మెసేజ్ ఓపెన్ చేయవద్దని సూచించారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి



సభ్యుల జాబితాను డిప్యూటీ ఎంపీడీఓకు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కలకడ : పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా కలకడ పంచాయతీ కార్యదర్శి కె.దేవేంద్ర తెలిపారు. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా కలకడ పంచాయతీ కార్యదర్శి కె.దేవేంద్రను ఏకగ్రీవంగా ఎంపికచేసినట్లు డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సంఘం ఎన్నికలో కె.దేవేంద్ర అధ్యక్షుడిగా, ఐ.సుబ్రహ్మణ్యం, ఆర్.నందిని ఉపాధ్యక్షులుగా, పి.జగన్నాథమురెడ్డి ప్రధానకార్యదర్శిగా, ఎస్.శైలజ కోశాధికారిగా, పి.రెడ్డిరాణి మీడియ ప్రతినిధిగా, సభ్యులుగా మధుమాలిని, గిరిధర్, వేణు, నరేంద్రనాయక్, రవీంద్రనాయక్, జయచంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగాగా ఎంపికైన సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ఐక్యమత్యంగా ఉండి పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గ సభ్యుల జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేశారు.

జూదరుల అరెస్ట్

కేవీపల్లె : తొమ్మిదిమంది జూదరులను అరెస్ట్ చేసి రూ. 10,110 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ జాండ్రపేట వద్ద గురువారం పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా తొమ్మిదిమందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కురబలకోట: మండలంలోని ఖుషీ దాబా వెనుక పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 13,870 స్వాధీనం చేసుకున్నట్లు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ గురువారం తెలిపారు. పేకాట, జూదం, కోడి పందేలు నిర్వహిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

అభివృద్ధి ప్రణాళికలు పటిష్టంగా రూపొందించాలి

నిమ్మనపల్లె : పంచాయతీ కార్యదర్శులు గ్రామ అభివృద్ధి ప్రణాళికలు పటిష్టంగా రూపొందించాలని ఎంపీడీఓ రమేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్(పంచాయతీ పురోగతి సూచిక) 2.0 లో భాగంగా పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ రూపొందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. అందులో భాగంగా ఆర్థిక సంవత్సరంలో సంబంధిత గ్రామపంచాయతీ అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా పేదరికం నివారణ, మెరుగైన జీవనోపాధుల కల్పన, ఆరోగ్యం, నీరు, పచ్చదనం–పరిశుభ్రత, స్వయంసమృద్ధి, మౌలికసదుపాయాలు, సామాజిక న్యాయం, భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక గ్రామపంచాయతీలను రూపొందించడంలో భాగంగా 9 థీమ్స్‌కు సంబంధించి 161 సూచికల ఫ్రేమ్‌వర్క్ తయారుచేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, రిసోర్స్ పర్సన్ వెంకటరమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

మోతీనగర్‌లో తాగునీటికి కటకట



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని మోతీనగర్‌లో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 15 రోజులుగా మున్సిపల్ కొళాయిల్లో నీళ్లు రాకపోవడంతో తాగునీటికి, ఇతర అవసరాలకు ట్యాంకర్లపై ఆధారపడాల్సిన దుస్థితి వచ్చింది. మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది ముందు చూపు లేకుండా అనాలోచితంగా ర్యెగులర్‌గా వెళుతున్న పైప్‌లైన్‌ను కట్‌చేయడంతో మోతీనగర్‌కు నీటిసరఫరా నిలిచిపోయింది. మోతీనగర్ ప్రాంతంలో వాటర్ పైప్‌లైన్ వెళుతున్న స్థలంను ఇటీవల ఓ ప్రజాప్రతినిధి కొనుగోలు చేయడం జరిగింది. తన స్థలంలో పైప్‌లైన్, టెలిఫోన్ కేబుల్ వెళుతుండటం గమనించిన ఆయన, తక్షణమే వాటిని తొలగించాల్సిందిగా ఆదేశించడంతో, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది తక్షణమే పైప్‌లైన్‌ను కట్‌చేశారు. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద గుంత ఏర్పడటమే కాకుండా, మోతీనగర్ ప్రజలకు నీటిసమస్య ఏర్పడింది. 15 రోజులుగా నీటి సమస్య పరిష్కరిస్తారని ఎదురుచూసిన స్థానికులకు, అధికారులు అటువేపు కన్నెత్తి చూడకపోవడంతో చివరకు విసుగొచ్చి గురువారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారులను నిలదీశారు. తక్షణమే చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు ట్యాంకర్లతో నీటిసరఫరా చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రమీల వారికి సర్దిచెప్పి పంపారు.

తాగునీటి కోసం ధర్నా

కలకడ : కలకడ ఇందిరమ్మ కాలనీలో తాగునీటి వసతి కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేయాలని కోరారు. పంచాయతీశాఖ అధికారులు, సర్పంచ్ స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

స్పందించిన సర్పంచ్

కలకడ సర్పంచ్ ప్యారీజాన్ ట్యాంకర్‌తో కాలనీ వాసులకు నీరు సరఫరా చేశారు. కాలనీలో నీరు సరఫరా చేసే బోరుకు మరమ్మతులు చేసి నీటిని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, ఇందిరమ్మ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోలదే కీలక పాత్ర

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



మదనపల్లె రూరల్ : ఓటరు జాబితా నవీకరణ, సవరణలో బూత్ స్థాయి అధికారులదే (బీఎల్‌వో) కీలక పాత్ర అని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బీఎల్‌వోలకు ఐదురోజుల జాతీయ శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బీఎల్‌వోలు తమ విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఐదురోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. పోలింగ్ స్టేషన్‌లో ఏఏ కనీస వసతులు ఉండాలి.. పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1,200 నుంచి 1,500 దాటితే.. అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ఏ చర్యలు తీసుకోవాలి.. బూత్ లెవల్ ఏజెంట్లతో ఎలా సమన్వయం చేసుకోవాలి.. ఈఆర్వో, ఏఈఆర్వోతో ఎలా వ్యవహరించాలనే విషయాలను శిక్షణా కార్యక్రమంలో అవగాహన కల్పించామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రధానమైనదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒకరినీ గుర్తించి ప్రతి 4 నెలలకు సైట్ ఓఫెన్ అయినప్పుడు ఓటరుగా నమోదుచేయించాలని సూచించారు. బీఎల్‌వోలుగా ఫారం–6,7,6ఏ, 8, ఒక్కో ఫారంకు ఎలాంటి నోటీసులు ఇవ్వాలి. ఏఏ డాక్యుమెంట్లు జతపరచాలి. ఏ ఫార్మేట్‌లో నమోదు చేయాలనే విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. బీఎల్‌వోలు పోలింగ్ స్టేషన్‌లను తరచూ తనిఖీ చేయాలని, ఏవైనా వసతులు లేకపోయినా, ఎన్నికల నిర్వహణకు పనికిరాకపోయినా, తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. బీఎల్‌వోలు విధులను బాధ్యతగా నిర్వర్తించినప్పుడే మంచి ఓటరు జాబితా తయారవడంతో పాటుగా ఎన్నికలు సజావుగా జరిగేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజలకు చెబుదాం



చంద్రబాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ క్యూర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నిసార్ అహ్మద్, నాయకులు

రామసముద్రం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చాటిచెబుదామని నియోజవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం రామసముద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు కేశవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని విమర్శించారు. కూటమి పాలనలో అంతా చీకటిమయమన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పేదల జీవితాల్లో చీకట్లు నింపిందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి కూటమి నాయకుల మోసాలను ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండిపడ్డారు. కూటమి వైఫల్యాలను ఇంటింటా ఎండగడుదామని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని, రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ బలం ఏమిటో కూటమి నాయకులకు చూపిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు అనూష శ్రీనాథ్ రెడ్డి, మాజీ ఏపీఎండీసీ డాక్టర్ షమీం అస్లాం, జిల్లా ఉపాధ్యక్షులు, జెడ్పీటీసీ సీహెచ్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ కుసుమ కుమారి, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ గెవన్న, సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్, కొండూరు కృష్ణారెడ్డి, జయరామి రెడ్డి, రెడ్డి వీరేగౌడు, కృష్ణప్ప, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి అదాలత్



ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో పాల్గొన్న అధికారులు

పీలేరు రూరల్ : విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ అదాలత్ నిర్వహించినట్లు విద్యుత్ అదాలత్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని ఏపీడీసీఎస్ డివిజన్ ఆఫీస్ వద్ద గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలు పరిష్కరించారు. అనంతరం రిటైర్డ్ జడ్జి మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సాంకేతిక సభ్యులు జి. మధుకుమార్, విజయలక్ష్మి, ఈఈ వై. చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీఏలు అమీర్‌బాషా, శివయ్య, ఏఈలు ఖాదర్ ఇలాహీ, రామ్మూర్తి, వరప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధితోనే దేశ అభివృద్ధి



మాట్లాడుతున్న ఏవో రాజేశ్వరి

పీలేరు : గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని ఏవో రాజేశ్వరి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాయంలో పంచాయతీ పురోగతి వెర్షన్ 2.0 ఎఫ్‌వై 2023–24పై అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు పురోభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. 2030 నాటికి గ్రామ పంచాయతీలు పురోభివృద్ధి చెందాలన్నారు. ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, సీడీపీవో రాజమ్మ, రిసోర్స్‌పర్సన్ జ్ఞానశేఖర్, ఏపీఎం జవహర్‌బాషా, ఏఈవో అశోక్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోండి

మదనపల్లె: అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మదనపల్లె నీరుగట్టుపల్లెలో ప్రభుత్వ అనుమతిలేని వడ్డీ వ్యాపారాలు జోరుగా సాగుతున్నట్లు తెలిపారు. రుణాలిచ్చి, వాటిపై అధికవడ్డీ వసూలు చేస్తూ దోచుకుతింటున్న వారిపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఫైనాన్స్ వ్యాపారుల వేధింపులతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పనుల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని బూర్లపల్లి పంచాయతీలో అధికారులు మురికి నీటి కాలువలను పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డ్‌లను తనిఖీ చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేంద్రం బృందం సభ్యులు రాజేష్, డిప్యూటీ ఎంపీడీవో క్రిష్ణప్రసాద్, కార్యదర్శి క్రిష్ణ ప్రసాద్, ఆంజనేయులుపాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

బి.కొత్తకోట: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంఈవో రెడ్డి శేఖర్‌లు తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యత, బియ్యం, కూరగాయలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ వాసుదేవరావు పాఠశాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

విజిలెన్స్ తనిఖీలు

కురబలకోట/ములకలచెరువు: కురబలకోట మండలం అంగళ్లు, ములకలచెరువు ఎరువుల దుకాణాల్లో గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని సూచించారు. అధిక ధరలకు విక్రయించరాదని హెచ్చరించారు. అధికారులు చంద్రశేఖర్, ఎల్లప్ప, పవన్‌కుమార్, అజిత, స్రవంతి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

కేవీపల్లె : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంపీడీవో సుధాకర్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విధిగా మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పాఠశాలకు అనుసంధానంగా ఉన్న బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి, ప్రిన్సిపాల్ శీనునాయక్, పాఠశాల కమిటీ చైర్మన్ రెడ్డిబాషా, అధ్యాపకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న అధికారులు